రైతుకు వర్రీ

• దెబ్బతిన్న వరినాట్లు • కాపాడుకునేందుకు రైతన్న పాట్లు



కసుకర్రులో మునిగిన వరి చేలు

పొన్నూరు: అధిక వర్షాలకు తోడు డ్రెయిన్లలో పూడికలు తొలగించకపోవడంతో పొన్నూరు మండలంలోని పలు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. మునిపల్లె, వెల్లలూరు, కసుకర్రు, నిడుబ్రోలు, కొండమూడి, నండూరు, కట్టెంపూడి, పచ్చలతాడిపర్రు, చిన ఇటికంపాడు తదితర గ్రామాల్లో వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. గత మంగళవారం ఏకధాటిగా కురిసిన భారీ వర్షం కారణంగా వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. వరిసాగుకు పెట్టుబడులు పెట్టిన రైతులు మునిగిన పంట చేలతో లబోదిబోమంటున్నారు.

చేలలో మురుగునీరు కదలడం లేదు..

ఇప్పటికే రైతులు దమ్ము, నారు, నాట్లు, కూలీల నిమిత్తం ఎకరాకు రూ. 10 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. వరదల ధాటికి వరి పొలాలు నీట మునగడంతో పంట నాశనమైందని వాపోతున్నారు. మళ్లీ నాటు వేయాల్సి వస్తుందంటున్నారు. మరికొంత మంది మొదటి దఫా ఎరువులు సైతం వేశారు. చేలకు అనుసంధానంగా ఉన్న పూడికలు పెరిగి చేలల్లోని మురుగునీరు దిగడం లేదు. నాట్లు వేసిన వరి పొలాలు మునిగిపోవడంతో పంట నాశనమైందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వరి నారు ఎక్కడా అందుబాటులో లేదని మళ్లీ నారుమడులు సిద్ధం చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. కాలువల్లో పూడికలు తీయకపోవడం వలన వరద పంట పొలాలను ముంచుతోందని రైతులు తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పొన్నూరు మండలంలో మొత్తం 28 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, వరద కారణంగా సుమారు 15 వేల ఎకరాల్లో వరి చేలు మునిగిపోయాయని వ్యవసాయ అధికారుల అంచనా.

నష్టం తప్పదు



ఏటా అధిక వర్షాల కారణంగా వరిసాగులో నష్టాలు తప్పడం లేదు. సకాలంలో డ్రెయిన్లలో పూడికలు తొలగించి రైతుల కష్టాలు తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కసుకర్రు గ్రామ పరిధిలో 6 ఎకరాల్లో సాగు చేస్తున్నా. 15 రోజుల క్రితం నాట్లు వేశాను. ఇంతలోనే వర్షాలు ముంచెత్తాయి. నాట్లు కుళ్లిపోతున్నాయి. అప్పుచేసి వరి సాగు చేపట్టాం. చేలు దక్కేలా లేవు.

–అంకమ్మరావు. రైతు, కసుకర్రు , పొన్నూరు మండలం

బాబు పాలనలో మోసాలు గ్యారెంటీ



పట్టణంలో బాబు మోసపూరిత మేనిఫెస్టోను ప్రదర్శించిన అంబటి మురళీకృష్ణ

• వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
• బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీలో చంద్రబాబు చేసిన అన్యాయంపై ఫిర్యాదుల వెల్లువ
• నియోజకవర్గ వ్యాప్తంగా బాబు మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాల పంపిణీ

పొన్నూరు: సీఎం చంద్రబాబు పాలనలో మోసపోవడం తప్ప మంచి జరిగిందని చెప్పేవారు కనిపించడం లేదు. అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసిన మోసాన్ని తెలియజేసేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గం, మండలం, గ్రామం, పట్టణ స్థాయిలో చేపట్టిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు అనేక పథకాలతో ప్రకటించిన మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. గ్రామాలు, పట్టణంలో ఏర్పాటు చేస్తున్న వేదికల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చంద్రబాబు పాలనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటూ తమకు జరిగిన అన్యాయాన్ని ఆయనకు తెలియజేస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో ఏటా రూ. లక్షకు పైగా నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేదని.. కూటమి ప్రభుత్వంలో పథకాల ఊసే ఉండటం లేదని వాపోతున్నారు. పథకాలు ఇచ్చినా అరకొరగా ఇస్తుండటంతో అనేక మందికి అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డులకు సంబంధించి 6 ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమలులో తమకు జరిగిన అన్యాయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కూటమి నాయకులు అనేక వాగ్దానాలు చేసి మోసం చేశారని వాపోయారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మోసం చేయడం చంద్రబాబు నైజమని, ఎలాగైనా ఎన్నికలలో గెలుపు కోసం ఎంతటి అబద్ధపు హామీ ఇవ్వడం చంద్రబాబుకు అలవాటని తెలిపారు. రానున్న ఎన్నికలలో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పి చెబితేనే ప్రజల భవిష్యత్తు బాగుంటుందని తెలియ జేస్తున్నారు.

క్లుప్తంగా

నాట్కో ట్రస్టుకు అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో ట్రస్టు అందిస్తున్న సేవలకు అవార్డు దక్కింది. స్వాతంత్ర్య వేడుకల్లో పురస్కరించుకుని మంత్రి నారా లోకేష్ నుంచి నాట్కో ట్రస్టు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు అవార్డు అందుకున్నారు. నాట్కో ట్రస్టు 2015 నుంచి గుంటూరు జీజీహెచ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొట్టమొదటిసారిగా రూ.2 కోట్లతో పిల్లల వార్డు, నర్సింగ్ స్కూల్‌ను ఆధునికీకరించారు. రోగుల సహాయకులు వేచి ఉండే గదిని ఏర్పాటు చేశారు. డయాలసిస్ యూనిట్‌ను నిర్మించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో పరికరాలు అందజేశారు. సుమారు రూ.40 కోట్లతో 2021లో క్యాన్సర్ వార్డును వంద పడకలతో నిర్మించారు. మళ్లీ తాజాగా వంద పడకలతో రూ.20 కోట్లతో మరో క్యాన్సర్ వార్డును నిర్మిస్తున్నారు. ప్రతి ఏడాది రూ.కోటి విలువ చేసే క్యాన్సర్ మందులను జీజీహెచ్‌కు వచ్చే రోగులకు అందజేస్తున్నారు. సుమారు పది సంవత్సరాలుగా నాట్కో ట్రస్టు చేస్తున్న సేవలకు గుర్తింపుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డు లభించింది.

జాతీయస్థాయి తైక్వాండోలో సత్తా చాటిన వాసంతిక



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గుంటూరులోని ఆక్స్‌ఫర్డ్ సీబీఎస్ఈ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఆర్.వాసంతిక తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల విజయవాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్టికల్ ఎక్స్‌లెన్స్ (వైస్) గత నెలలో పోటీలు నిర్వహించారు. శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థులను కళా, క్రీడా, సాంస్కృతిక అంశాల్లో ప్రోత్సహిస్తున్నామని, తద్వారా విద్యార్థులు ఆయా ప్రతిభా పాటవ పోటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్.ఆరోగ్య జోసఫ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేకతమైన ప్రతిభ దాగి ఉంటుందని, నైపుణ్యాలను వెలికితీస్తే ప్రతిభావంతులుగా రాణిస్తారని అన్నారు. అదే విధంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న టీజేపీఎస్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి క్రీడల ఎంపికలో ఆక్స్‌ఫర్డ్ సీబీఎస్ఈ స్కూల్ నగరాలు క్యాంపస్‌కు చెందిన యడ్లపల్లి భూమి అండర్–14 విభాగంలో గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టులో స్థానం పొందినట్లు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుడి నగరోత్సవం



నగరంపాలెం: శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా శనివారం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి ఆలయ అర్చకులు కృష్ణస్వామి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, మాఢవీధులలో ఊరేగింపు చేపట్టారు. స్వామి ఊంజలసేవ, తీర్థప్రసాద వితరణ జరగ్గా, భక్తులు తరలి వచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ పాలకవర్గం కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంగళగిరి రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని రైలు కింద పడి 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే జీఆర్పీ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. నంబూరు– మంగళగిరి మధ్యలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని చుట్టు పక్కల వారిని విచారించగా ఎలాంటి సమాచారం తెలియలేదు. మృతుడి కుడి చేతిపై అమ్మ అని, ఎడమ చేతిపై హాట్ సింబల్ గుర్తులతో పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు. జీఆర్పీ సీఐ జి.అంజిబాబు 9010999939, జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు 9440790522కు సమాచారం అందజేయాల్సిందిగా కోరారు.

స్వాతంత్ర్య సమరయోధులను మరిచారే!

ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం



పూలమాలలకు కూడా నోచుకోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వర్సిటీ ఆవరణలో స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ విగ్రహాలకు మాత్రం నివాళులు అర్పించకపోవడంపై ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం ఒక ప్రకటన ద్వారా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు నాసరయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిందని సంబరాలు చేసుకుంటున్నాం, ఆ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహానీయులకు కనీసం పూలమాల వేసి గౌరవించడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజులతో లక్షల రూపాయలు ఖర్చు చేసి వేడుకలు నిర్వహిస్తున్నారు. కానీ స్వేచ్ఛ గాలికి కారకులైన వీరులను మరచిపోవటం బాధాకరమన్నారు. జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తే సరిపోతుందా, స్వాతంత్ర దినోత్సవం ఎవరి కోసం జరుపుకుంటున్నాం, ఎందుకు జరుపుకుంటున్నారో వర్సిటీ యాజమాన్యం ఆలోచించాలన్నారు. అలానే పలువురు ప్రజాప్రతినిధులు మంచి ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. జాతీయ పితామహుల కీర్తిని ప్రజలకు తెలియచేయడం, వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించడం మరచిపోతున్నారు. జెండాకు సెల్యూట్ చేసి ఫోటోలు దిగడమే పరిమితమైంది. ఇప్పటికైనా యూనివర్సిటీ యాజమాన్యం స్వాతంత్ర్య సమరయోధుల ఖ్యాతిని ప్రజలకు తెలియజేసి, వారికి గౌరవం ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభమైన ఆళ్ళ శ్రీ తినంకమ్మ తల్లి కొలుపులు



గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసియున్న ఆళ్ళ వారి శ్రీ తినంకమ్మతల్లి కొలుపుల మహోత్సవం ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలను నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామికి ఆళ్ళ వంశీకుల మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం, సాయంత్రం ముగ్గుల కార్యక్రమం, తెల్లవారుఝామున దేవర ఇంటినుంచి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలిపారు. సోమవారం అమ్మవారికి మహా పొంగలి కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి తీర్థ ప్రసాదం అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

అలరించిన మృదంగ లయ విన్యాసం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం మృదంగ సద్గురువుల సంస్మరణోత్సవ సభ నిర్వహించారు. శ్రీ మహాదేవు రాధాకృష్ణరాజు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల సంయుక్తంగా నిర్వహించగా, ఆలయ పాలకవర్గం జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కే.శే.మహాదేవు లక్ష్మీ నారాయణరాజు ప్రశిష్య బృందం కుందుర్తి అరవింద్, కార్తికేయ ఆదినారాయణశర్మ, మల్లాది అరవింద్, కొండా సుబ్రహ్మణ్యం, మొదలి కృష్ణసాయి, సిహెచ్.సూర్య, బి.సాయిచరణ్, వై.ఇందువర్ధన్, కె.అక్షయ్‌పాల్ మృదంగ లయ విన్యాసం అత్యద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం జొన్నలగడ్డ సత్యశ్రీరామ్ పలు వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై అంబటిపూడి కామాక్షి, మృదంగంపై కుందుర్తి అరవింద్, డోలుపై కె.ఎం. మనోహర్, నాదస్వరంపై కాల్వ ఎంవీ. సుబ్బరామయ్య వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ విష్ణుభట్ల కృష్ణవేణి, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన ఎంపీ



ఎంపీని సన్మానిస్తున్న తెలగ అభ్యుదయ సంఘం నాయకులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల శ్రీ రఘుపతి వెంకటరత్నంనాయుడు కాపు విద్యార్థి వసతి గృహాన్ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు శనివారం సందర్శించారు. తెలగ అభ్యుదయ సంఘం నాయకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల యూనివర్శిటీల్లో చదువుతున్న కాపు విద్యార్థులకు హాస్టల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రతి జిల్లాలో పేద కాపు విద్యార్థులకోసం ఇదేవిధంగా హాస్టళ్ళు నెలకొల్పాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి సమస్యలున్నా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎంపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాలశెట్టి విజయ్‌కుమార్ సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, పూరిబండి శ్రీకాంత్, డేగల వెంకటేశ్వరరావు, కటాల కృష్ణ, పరిమి సత్యనారాయణ, ఎమ్ శ్రీనివాస్, తుమ్మల కృష్ణకిషోర్, తుమ్మల నరశింహ, పూరిబండ కృష్ణమూర్తి, చెమిడిగంటి కిరణ్, పోలిశెట్టి వేణు, మాదాస్ గోపి, తెలగ అభ్యుదయ సంఘం నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన గౌతు లచ్చన్న



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నూరిఫాతిమా



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పట్నంబజారు: స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారిని ఎదురించి పోరాడిన మహా యోధుడు సర్దార్ గౌతులచ్చన్న అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కొనియాడారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి శనివారం గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పోరాడారన్నారు. పోరాటానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతుడు లచ్చన్న అని కీర్తించారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి మేయర్ కోవెలమూడి రవీంద్ర

నెహ్రూనగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంకిత భావంతో కృషి చేసిన ప్రజా నేత గౌతు లచ్చన్న అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నగరంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ఒక స్వాతంత్ర్య సమరయోధుడు, నిస్వార్థ రాజకీయ నాయకుడిగా పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆయన జీవితం నిత్యం పోరాటాలతో ప్రజాసేవకు అంకితమైందన్నారు. భావి తరాలు ఆయన పోరాట పటిమ, పేదలపై ఆయన చూపిన సేవా నిరతిని స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులు

నెహ్రూ నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి శనివారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, రైతు ఉద్యమ నాయకుడు, బహుజన ఉద్యమ నాయకుడు గౌతు లచ్చన్న అని కొనియాడారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఉండాలని రాష్ట్ర స్థాయిలో ఉద్యమం నడిపిన గొప్ప యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని, ఆయన ఆశయాలను, ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, రజక మహిళా ప్రధాన కార్యదర్శి పెనుమాక రమాదేవి, గుంటూరు జిల్లా రజక జనసేవ సంఘం నాయకులు వట్టికూటి సాంబయ్య, నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, ఆర్పీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విప్పర్ల మత్తయ్య, వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య, దళిత ఉద్యమ నాయకులు డి.ప్రకాష్ పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వడ్లమూడిలో ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



వడ్లమూడి అడ్డరోడ్డులో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకల్లో కేసన శంకరరావు

చేబ్రోలు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గీత కులాల ఐక్యత కోసం కృషి చేసిన, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని చేబ్రోలు మండలం వడ్లమూడి అడ్డరోడ్డులో శనివారం ఘనంగా నిర్వహించారు. వడ్లమూడి అడ్డరోడ్డులోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, ఇతర బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌత లచ్చన్న విగ్రహ కన్వీనర్, మాజీ సర్పంచ్ వీరంకి రంగారావు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తుళ్లూరు శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు చెన్ను శ్రీనివాసరావు, గౌడ సంఘం నాయకులు రాయన రాంబాబు, మల్లాల శ్రీనివాసరావు, సింహాద్రి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: స్వాతంత్ర్య పోరాటంలో సర్దార్ గౌతు లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయమని రాష్ట్ర బిసి సంక్షేమసంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. పెదకాకాని గౌడ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన వ్యక్తులలో ప్రముఖులు గౌతు లచ్చన్న సర్దార్ బిరుదాంకితుడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం నాయకులు అనుమోలు ఏడుకొండలు గౌడ్, కుక్కల మల్లికార్జునరావు, పాగోలు శ్రీనివాసరావు, క్రోసూరి పూర్ణచంద్రరావు, కారంకి కోటేశ్వరరావు, డాక్టర్ ఉప్పాల శివాజీ, యడవల్లి మధుబాబు, పాగోలు రాము, తుళ్లూరు నరసింహారావు,చింతా పోతురాజు, తాత సాంబశివరావు, వీరంకి రంగారావు పాల్గొన్నారు.

ఎస్టీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం జరుగుతుందని యానాదుల సంక్షేమ సంఘం, యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య యానాది పేర్కొన్నారు. శనివారం గుంటూరులోని గోపాలకృష్ణయ్య యానాది కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది యానాదులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో అత్యధిక జనాభా యానాదులు ఉన్నారని, గిరిజన జాతులలో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు నేటికీ అన్ని విధాలా వెనుకబడి ఉన్నారని తెలిపారు. సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనకబడి ఉన్న యానాదులకు ఎస్సీ వర్గీకరణ వలే ఎస్టీ వర్గీకరణ చేసి ఉద్యోగ, రిజర్వేషన్ పరంగా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల బ్రహ్మయ్య, అధికార ప్రతినిధి పొన్నూరు అంకమరావు, జిల్లా అధ్యక్షులు బాకుల మురళీ, ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావూరి రాజు, ఉమామహేశ్వరరావు, జున్ను కళ్యాణి, చేవూరు కృష్ణ వేణి పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే సీపీఐ ధ్యేయం



లక్ష్మీపురం: కార్మిక హక్కుల పరిరక్షణకు సీపీఐ పని చేస్తోందని సీపీఐ నాయకుడు కోట మాల్యాద్రి పేర్కొన్నారు. శనివారం రేగుల రాఘవయ్య భవనంలో గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, కర్షక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచడానికి వ్యతిరేకంగా ఉద్యమించనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ హమాలీ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్నఆంజనేయులు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని గతంలోనే పార్లమెంట్ కమిటీ వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఆ కమిటీ సిఫార్సు చేసిన నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి అమలు చేయటానికి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా 26 మహాసభలు ఆదివారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు బ్రహ్మానంద రెడ్డి స్టేడియం నుంచి ప్రజాప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. నగరంలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, నగర ముఠా కార్మిక సంఘం నాయకులు ఎస్.లక్ష్మయ్య, పప్పుల రోసి రెడ్డి, రమణ, శీను, పొనుగోటి వెంకటరెడ్డి, రేగుల రాఘవ, కొత్త శివారెడ్డి, ఏనుగంటి వెంకట్రావు, ముసలా లక్ష్మయ్య, కొత్త నాని, ఎస్సీ కొండయ్య, సిరిగిరి దుర్గా, అనంతయ్య, సోమిరెడ్డి, అమరలింగం పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

దుగ్గిరాల: అధిక వర్షాల వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఎకరాకు రైతుకు రూ.15 వేలు ప్రభుత్వం అందించాలని కౌలు రైతు సంఘం జిల్లాకార్యదర్శి కె.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం బృందం శనివారం దుగ్గిరాల మండలంలోని పెనుమూలి, మంచికలపూడి, పెదకొండూరు, గ్రామాలలో పర్యటించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వరి వెద పద్ధతిలో వేయటం వల్ల అకాల వర్షాలకు సుమారు లక్ష ఎకరాల్లో నష్టం వాటిల్లిందన్నారు. మురుగు నీటి కాలువల్లో ఉన్న తూటి కాడ, గుర్రపు డెక్క సరిగా తొలగించక పోవడం ద్వారా మురుగునీటి పారుదలకు జరగక పంట నీటి మునిగిందని తెలిపారు. ప్రభుత్వం హడావుడిగా కాకుండా, శాశ్వతంగా పరిష్కరించే విధంగా కాలువలను మెరుగు పరచాలని, రైతు మరల పంట వేయడానికి ఎకరాకు రూ.15 వేలు తగ్గకుండా సహాయం చేసి వారిని ఆదుకోవాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18న మండల కేంద్రాల్లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మన్నవ నాగమల్లేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వర రావు, ఎం.శివ సాంబిరెడ్డి, ఎం.భవన్నారాయణ, అమ్మిరెడ్డి, అంజిరెడ్డి, బి.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.